క్లుప్తంగా

'ముస్లిం లెజెండ్స్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

హిందూపురం: భారతీయ చరిత్రలో నిలిచిన ముస్లిం లెజెండ్స్ పాత్ర తెలుగు పుస్తకాన్ని బెంగళూరులోని గాంధీ భవన్‌లో సిక్కు జాతీయ రైతు సంఘం నాయకుల చేతుల మీద పుస్తకావిష్కరించారు. శుక్రవారం భారత జాతీయ కిసాన్ సంఘ్ నాయకులు జగ్జీత్ సింగ్ దల్లైవాల్ ఆధ్వర్యంలో అభిమన్యూ కోహాడ్‌లచే జాతీయ రైతు సంఘ నాయకులచే ముస్లిం లెజెండ్స్ పుస్తక రచయిత, టిప్పుసుల్తాన్ యూనైటెడ్ ఫ్రంట్ నాయకుడు హిందూపురం కల్లూరు ఉమర్ ఫారూక్‌ఖాన్ ఆవిష్కరించారు. భారతదేశ నిర్మాణంలో ముస్లిం దేశభక్తుల పాత్రను పుస్తకంలో వివరించడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమం జగ్జీద్‌సింగ్ దల్లైవాల్ మాట్లాడుతూ తెలుగు భాషలో ముస్లిం దేశభక్తుల పుస్తకం ప్రచురించి పరోక్షంగా తెలుగు భాష చైతన్యం కోసం ఉద్యమించటం అభినందనీయమన్నారు.

చెరువుల పరిశీలన


హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లి గ్రామంలోని హంద్రీనీవా కాలువలను, చెరువును ఇరిగేషన్ ఈఈ గురుమూర్తి, డీఈ రమణారెడ్డి, ఏఈఈ లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. కాలువ, చెరువుకు మరమ్మతు ఏమైనా చేయాల్సి ఉందా? అని రైతులతో ఆరా తీశారు.

78 మంది ఉద్యోగాలకు ఎంపిక

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాలో 78 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సీడాప్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించారు. 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 156 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 78 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం టౌన్: శాంతియుతంగా నిరసన చేస్తున్న దళిత సంఘాల నాయకులపై వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ పరిగి మండలం ఊటుకూరుకు చెందిన ఐటీఐ విద్యార్థిని అఖిల్ బైక్‌పై వెళ్తుండగా శాసనకోట దగ్గర వెనుక నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ ఆస్పత్రి దగ్గర చర్చిస్తుండగా సీఐ రాజగోపాల్‌నాయుడు సిబ్బందితో వచ్చి తమను పోలీసుస్టేషన్‌కు జీపులో తీసుకెళ్లారన్నారు. బాధితులకు మద్దతుగా నిరసన తెలిపితే అక్రమ కేసులు పెడతారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, దళిత సమైక్య జిల్లా అధ్యక్షుడు నారాయణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా నాయకురాలు జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా.. కనిపించని బీమా!





- ఇప్పటికీ తెరచుకోని వెబ్‌సైట్
- ఏడాది గడిచినా దరఖాస్తులు స్వీకరించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేదలకు ఆసరా

మడకశిరరూరల్: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గడిచిపోయినా హామీలను మాత్రం నెరవేర్చలేకపోతోంది. పథకాలకు కేవలం పేర్లు మార్చు చేసి మిన్నకుండిపోతోంది. కనీసం కుటుంబాల్లో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

పేరు మార్పుతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమాగా ఉన్న పేరును చంద్రన్న బీమాగా పేరు మార్పుతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకూ చంద్రన్న బీమా పథకం విధి విధానాలను ప్రకటించలేదు. సహజ మరణానికి రూ.5 లక్షలు. ప్రమాదవశాత్తూ మృతి చెందింతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకొని సంబరాలు చేసుకున్నారే తప్ప బీమా పథకం అమలుపై దృష్టి పెట్టలేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రారంభం కాని వెబ్‌సైట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది. అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చినా వెబ్‌సైట్ ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలులేవని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కుటుంబ యజమానులు, సభ్యులను కోల్పోయిన బాధితులు బీమా ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 సంవత్సరాల్లోపు, 50 నుంచి 60 లోపు సంవత్సరాల వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ వైఎస్సార్ బీమా మంజూరు అయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు ,గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలను అందించే వారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీమా మంజూరు చేయాలి



ఇంట్లో కుటుంబ సభ్యుడు, యజమానిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు బీమా సొమ్మును కూటమి ప్రభుత్వం మంజూరు చేయాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మృతుల కుటుంబాలకు బీమా సొమ్ము ఖాతాల్లోకి జమ చేసి ప్రజలకు అండగా ఉండేది. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని అమలు చేసి మృతుల కుటుంబాలకు బీమా మంజూరు చేయాలి.

– శేషాద్రి , వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మడకశిర

నేడు 'బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ'

లేపాక్షి: మండలంలోని కొండూరు, కల్లూరు, మానేపల్లి గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొండూరులో ఉదయం 10 గంటలకు, కల్లూరులో 11 గంటలకు, మానేపల్లిలో 12 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

అగళిలో...

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లి, కోడిపల్లి, అగళి పంచాయతీల్లో శనివారం పంచాయతీ స్థాయిలో బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల అబ్జర్వర్ సాయి లీల హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అగళి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖ అధికారులు హాజరుకావాలని కోరారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తాం


పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సోమందేపల్లి: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని 'బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి క్రాస్‌లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టో మోసాలపై ప్రజలతో స్కాన్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, పట్టణ ఉపాధ్యక్షుడు మంజు, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, వైస్ సర్పంచ్ వేణు, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సర్పంచ్‌లు జిలాన్, సోముం, స్థానిక నాయకుల నరసింహ మూర్తి, ఆదినారాయణ రెడ్డి, శివ, హనుమంతు, గోవిందరెడ్డి, శ్రీరాములు, జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని పరిరక్షించాలి


పరిగి: పోస్టుకార్డులు చూపిస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్/పరిగి: లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపి, విద్య, వైద్యం, నిరుపేదలకు నివాసాలు, పేదలకు ఆర్థిక స్వావలంభన చేకూరుస్తున్న ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని విద్యార్థులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. శుక్రవారం మడకశిర పట్టణంతో పాటు పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏఎం లింగణ్ణ పాఠశాల విద్యార్థులు పోస్టు కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీ సేవలను గుర్తించి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేసి సేవలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మద్యం వ్యాపారులు సమయ పాలన పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పెనుకొండ రూరల్: మద్యం వ్యాపారులు దుకాణాలు తెరిచే, మూసే విషయంలో సమయ పాలన తప్పకపాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. శుక్రవారం పెనుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు గొర్రెల మృత్యువాత


మృతి చెందిన గొర్రెలు

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధి పుట్టగూర్లపల్లిలో పాడి రైతు సూర్యనారాయణకు చెందిన గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గురువారం రాత్రి తనకున్న 30 గొర్రెలను యథావిధిగా గొర్రెలను రప్పంలో ఉంచాడు. శుక్రవారం వేకువజామున గొర్రెల రప్పాని దగ్గరకు వెళ్లి చూడగా ఆరు గొర్రెలు, ఓ మేక మృతి చెందినట్లు గుర్తించాడు. పశుసంవర్ధకశాఖ, ఫారెస్టు అధికారులు మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

లేపాక్షి: లేపాక్షి గ్రామంలో మూడు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులను గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏఓ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారందరికీ పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు.

విమర్శలు మాని అభివృద్ధి చేయండి


మడకశిరలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు


మాట్లాడుతున్న కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తదితరులు

మడకశిరరూరల్: ప్రతి పక్షంగా ప్రజలకు మద్దతుగా కూటమి వైఫల్యాలను ఎండగట్టుతున్న వైఎస్సార్‌సీపీని విమర్శించడం మాని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. సమన్వయకర్త ఈరలక్కప్ప, రాజకీయ చరిత్ర ఉన్న వైసీ తిమ్మారెడ్డి, వైవీ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ తాలుకా లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. వైసీ తిమ్మారెడ్డి, వైవీ తిమ్మారెడ్డికి నియోజకవర్గంలో భూదాతలుగా పేరు ఉందని గుర్తు చేశారు. శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళిత బిడ్డలకు రక్షణ కరవువైందని విమర్శించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రామగిరి మండలంలో దళిత బాలికకు అన్యాయం జరిగినా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పించి ఆర్థిక సాయం అందించాలని మడకశిరకు వచ్చిన హోం మంత్రి అనితకు వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి వినతిపత్రం ఇద్దామనుకుంటే పోలీసులచే నిర్బంధించారని చెప్పారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన నేతలను కూడా అడ్డుకున్నారని మండిపడ్డారు. పాలన చేతగానే వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అరాచక పాలన సాగించడం మానుకుని ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తూ మరొవైపు రైతులు, ప్రజల సంక్షేమానికి పెద్దపీట చేశారన్నారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు మాని మడకశిర ప్రాంతా అభివృద్ధిపై కూటమి పాలకులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సతీష్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర, తాలుకా, మండల ఎస్సీ సెల్ సభ్యులు రేకులకుంట హనుమంతరాయ, సింగల్ విండో మాజీ డైరెక్టర్ రాజశేఖర్, మంజునాథ్, నరసింహ, రంగనాథ్, రఘునందన్, నగేష్, గోపి, ధను, లక్ష్మీనరసప్ప, శివగంగప్ప, స్వామి, తిప్పేస్వామి, పట్టణ , తాలుకా కమిటీ సభ్యులు శేషాద్రి, మల్లికార్జున, మధు, అంజలి, ఓంకార్, సుధాకర్, కెంచప్ప, సికిందర్, వసీమ్, బాలకృష్ణారెడ్డి, నాగభూషణరెడ్డి, దొడ్డయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పపై కూటమి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ కేంద్రంలోని మీడియా మిత్రుల భవనంలో కన్వీనర్ యంజారేగౌడు, నాయకలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయకర్త ఈరలక్కప్పను అవహేళన చేస్తూ కూటమి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఉత్తుత్తి హామీలిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో పబ్బంగడుపుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నాయకులు అక్రమ వసూళ్లతో ప్రజలను, వ్యాపారులను దండుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలను మానుకొని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ శివన్న, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు గుడ్డదహళ్లి నాగరాజు, పాండు, నాయకులు తిప్పేస్వామి, బోరన్న, మాజీ డీలర్ చంద్ర, నటరాజు,బోజరాజు, మూడ్లప్ప, గిరియప్ప, శివరాజు, రామచంద్ర తదితరుల పాల్గొన్నారు.

అమరాపురం: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను విమర్శించేస్థాయి మండల టీడీపీ నాయకులకు లేదని మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు శివన్న, శివకుమార్, మాజి కుంచిటి వక్కలిగ కార్పోరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప విమర్శించారు. శుక్రవారం అమరాపురంలో వారు మాట్లాడుతూ గురువారం మండల టీడీపీ నాయకులు ఈరలక్కప్పను విమర్శించడం సరికాదన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ బురద జల్లేందుకు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. అమరాపురం మండలంలో ఎక్కడ అభివృద్ధి చేయలేదని స్పష్టం చేశారు. అమరాపురం నుంచి విరుపసముద్రం బార్డర్ వరకు ఉన్న రోడ్డు గుంతలున్నా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఎంపీటీసీ హనుమంతరాయ, వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు మంజునాథ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అమరాపురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం- 2ను గుడిబండ సీడీపీఓ గంగరత్న శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం రిజిష్టర్లను పరిశీలించారు. అలాగే ప్రీ స్కూల్ పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాల హాజరును పరిశీలించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రొద్దం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అనంతశక్తి సొసైటీ కార్యాలయం ఆవరణంలో 26వ వార్షిక మహాసభను సుశీలమ్మ అధ్యక్షతన సీఈఓ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. టింబక్టు-కలెక్టివ్ సంస్థ అధినేత బబ్లూ గంగూలి మాట్లాడుతూ అనంతశక్తి సొసైటీ మహిళల ఆర్థికాభివృద్ధికి కొండంత అండగా నిలుస్తోందన్నారు.

పథకాల అమలుపై సమీక్ష

అమరాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర మానిటరింగ్ టీం లీడర్ దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సర్పంచ్ వాగేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు అందిస్తున్న సామాజిక పింఛన్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొందరు తమకు పింఛన్ అర్హత ఉన్నా ఇవ్వడం లేదని వాపోయారు.

సంక్షిప్త సమాచారం

కార్మికుడికి పరామర్శ

హిందూపురం: హిందూపురం మండలం గొల్లపురం పారిశ్రామికవాడలోని బ్లూ గోల్డ్ స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా 22వ తేదీ గాయపడిన వలస కార్మికుడు అనూప్ హిందూపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. శుక్రవారం కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు పరామర్శించారు. ఫ్యాక్టరీలో ప్రమాదం కారణంగా కార్మికుడి ఎడమకాలు పూర్తిగా తొలగించారని, చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులు చౌళూరు రవికుమార్, తాలూకా కార్యదర్శి మారుతీరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిద్ధగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి, ఎం.రాయాపురం, హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ప్రత్యేకంగా విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులు శివన్న, సుధీర్‌రెడ్డిలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు.

బీసీ హాస్టల్ తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం శుక్రవారం మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో స్టోర్ రూమ్, వంటగది తనిఖీ చేశారు.

కండీషన్‌లో ఉన్న బస్సులే నడపాలి

రొళ్ల: మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమానులు కండీషన్‌లో ఉన్న స్కూల్ బస్సులను మాత్రమే నడపాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని భూభినకుంట వద్ద ఉన్న ప్రైవేట్ పాఠశాలతో పాటు పట్టణంలోని బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరీ, మురళి ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. స్కూల్ బస్సులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

రేపు పుస్తకావిష్కరణ

హిందూపురం టౌన్: శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల ఆధ్వర్యంలో రిటైర్డ్ హెచ్‌ఎం కల్లూరు జానకీ రామరావు తెలుగులోకి అనువదించిన 'మంకుతిమ్మన కగ్గ' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల మేనేజింగ్ ఎడిటర్ కల్లూరు రాఘవేంద్రరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో 27న ఉదయం 11 గంటలకు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు.


రొళ్ల : అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి


మడకశిర: శాకంబరి అలంకారంలో వడిశలమ్మ


హిందూపురంలో అష్టలక్ష్మి ఆలయంలో..


శ్రావణ సందడి


సాక్షిబృందం: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా హిందూపురం, పెనుకొండ, మడకశిరలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సోమందేపల్లికిలోని పాత ఊరులో వెలసిన చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.



సోమందేపల్లి: బోనాలు ఎత్తుకుని వస్తున్న భక్తులు


హిందూపురం: మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

వైభవంగా సత్యసాయి రథం ఊరేగింపు


హిందూపురం: భజనలతో పురవీధుల గుండా సాగుతున్న రథోత్సవం


పరిగి: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


రథంలో అలంకరణలో సాయి చిత్రపటం

మడకశిర/పరిగి/హిందూపురం: భగవాన్ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి ప్రేమ వాహిని రథం ఊరేగింపు అత్యంత వైభవంగా జరుగుతోంది. శుక్రవారం మడకశిర, పరిగి, హిందూపురం పట్టణాల్లో రథాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. మేళ వాయిద్యాలు, డప్పులతో ఆద్యంతం భక్తి పారవశ్యం, సాయి బాబా భక్త బృందం చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సత్యసాయిబాబా భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు లేపాక్షిలో..

లేపాక్షి: సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు లేపాక్షికి సత్యసాయి ప్రేమ ప్రజావాహిని దివ్య రథం విచ్చేస్తున్నట్లు లేపాక్షి సత్యసాయి సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయం నుంచి ప్రారంభమై లేపాక్షిలోని పురవీధుల గుండా ఊరేగింపు సాగుతుందన్నారు.